# అవరోహణ

సుజాతకి పెళ్లయి పదేళ్ళు దాటింది. చదువుకున్నవి చాలవరకు మరిచిపోయినా కొన్ని సంస్కృత సూక్తులు మాత్రం మనసులో పదిల పరచుకుంది. అందులోనూ "చిత్తే వాచి క్రియా యాంచ సాధునామేక రూపత్' అనే సూక్తి మరీ ఇష్టం. కారణం అన్ని విధాలా యిది భర్త రామ్మూర్తికి వర్తిస్తుందని యిన్నేళ్ళుగా నమ్మి తన్మయత్వం చెందుతుండేది. చిత్తంలో, మాటలో, చేతిలో అతను జెంటిల్‌మెన్ అని సుజాతకి తిరుగలేని విశ్వాసం. పదేళ్ళకి మించి ఈ పరీక్షలో నెగ్గుకొస్తున్న రామ్మూర్తిని సమయం చిక్కినప్పుడల్లా ప్రత్యేకించి ఆదివారం మెచ్చుకోళ్ళతో ముంచెత్తేది. సంతోషంతో రామూర్తి వుబ్బితబ్బిబ్బులయ్యేవాడు.

మితంగా సిగరెట్టు తాగడం తప్ప రామ్మూర్తికి చెడు అలవాట్లు లేవని సుజాత మురిసిపోయేది. పరాయి ఆడవాళ్ళని భర్త కన్నెత్తి పరకాయించడం సుజాత యింతవరకు చూడలేదు. భార్యకి అంతకంటే ఆనందం మరొకటి వుండదు.

సుజాతది భ్రమ కాదు. జెంటిల్‌మెన్ అనిపించుకోడానికి అర్హుడే సంఘంలో మంచి స్థానం సంపాదించుకున్నాడు. చదువుంది. రూపం వుంది. పెద్ద పేరున్న కంపెనీకి జనరల్ మేనేజర్. సొంత ఇల్లు సొంతకారు అమర్చుకున్నాడు.

ఇంటి దీపం రఘు బుద్ధిగా చదువుకుంటున్నాడు.

మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతున్న చల్లని సంసారం లోకి ఆ ఆదివారం రాకుండా వుంటే యెంత బాగుండేది.

పొద్దున్నే పనిమనిషి బెల్లు కొట్టినప్పుడు లేచి తలుపు తీయడానికి సుజాత కొంచెం బద్ధకించింది పనుల తొందర వుండదు కాబట్టి "ప్లీజ్ తలుపు తీయండి. ఈలోగా ఇల్లూ వాకిలీ వూడుస్తుంది కాసేప య్యాక గిన్నెలు పడేస్తాను" భర్తని బ్రతిమాలింది.

"నో ప్రాబ్లం"అంటూ రామూర్తిలేచి వరండా లైటువేసి వీధితలుపు తీశాడు తెల్లవారొస్తోంది. గుమ్మం దగ్గర పనిమనిషి నిలబడి వుంది. మామూలుగా అమ్మగారే తలుపు తీస్తున్నారనుకుని చిరు నవ్వుతో ఎదురు చూసినది. రామ్మూర్తికి షాక్ తగిలినట్లయింది. కొందరు ఆడ వాళ్ళ అందం విద్యుత్తులా పనిచేస్తుంది రామ్మూర్తిక్షణం సేపు స్థాణువై పోయాడు. "కళ్ళయెంత చక్కగా వున్నాయి మెరుస్తున్నాయి. చేప కళ్ళంటే యివేకాబోలు వని మనిషి ఇంత అద్భుతంగా వుంటుందా!!" ఆ పెదాల సౌందర్యం రామ్మూర్తిని ఆశ్చర్య పరచింది. ముక్కుపుడక తలకొప్పు ఆమె అందాన్ని రెంటింతలు చేశాయి. తెలియకుండా రామ్మూర్తి గుండె వుప్పొంగింది చూపు అలాగే పనిమనిషి కళ్ళల్లో యిరుక్కుపోయింది.

తనని పోల్చుకోలేదేమోనని "నేనండి అయ్యగారూ!

పనిమనిషి అంజయ్యాను అమ్మగారు లేవలేదాండి!" అడిగింది ఆమె కళ్ళు అమాయకంగా చూస్తున్నాయి.

ఆ ప్రశ్నకి రామూర్తి తెప్పరిల్లి "అ——అ" ఇప్పుడే లేస్తుంది. ఊడుస్తుండమని చెప్పింది మాటలెలాగో పెగిలి వచ్చాయి.

పేపర్‌బోయ్ వేసిన పత్రిక తీసుకుని లోపలికి వెళ్ళి లైటువేసి మంచం మీద పడుకుని పేజీలు తిప్పసాగాడు.

సుజాత కాసేపయ్యాక లేచివెళ్ళింది.

రామ్మూర్తికి చదువుతున్న వాక్యాలు బుర్రకెక్కడం లేదు. ఇంతలో యెంత మార్పు !! మనస్సంతా అంజమ్మ ఆక్రమించింది.

వివేకం, కోరిక నాసేపు భీకరంగా వాదించుకుని పోరాటం సాగించాయి. వివేకం తుత్తునియలై పోయింది

రామ్మూర్తి మనఘ పొరలు అలలెత్తుతున్నాయి.

'ఫాంటాస్టిక్ ! పనిమనిషి ఇంత అందంగా వుంటుందా. ఒక వేళ నిద్రమత్తులో నాకలా అనిపించిందా .... అబ్బే, ఇప్పుడేగా తేరిపార చూపింది. ఎంత అకర్షణ. పార్టియాల్ డేంజరస్ ఫర్ యే మాన్ అని ఎవరో తలమాసిన వాడన్నాడు. నెవర్ మైండ్. సుజాతకీ అంజమ్మకు ఎంతపోలిక ! ఒకే ఎత్తు. ఒకే రకం పర్సనాలిటీ. సిడ పట్టునవుంటుంది కాబట్టి సుజాత నాజూకుగా వుంది. సుజాత సన్నజాజీ, అంజమ్మ బొడ్డుమల్లె. కిందటి వారమే పాత మనిషి వయస్సు మళ్ళినందువల్ల పని చేయలేనని చెప్పడంతో కొత్త పనిమనిషిని సుజాత కుదిర్చింది. అయినా ఈ వారం రోజుల్లో విమాగా చూసే సందర్భం రాలేదు .... అంజమ్మ వివరాలు ఎలా తెలుస్తాయి ? మాటల సందర్భంలో రాబట్టాలి. సుజాత తెలివిగలది. ఇలాంటి విషయాల్లో వాళ్ళదే పైచేయి. ఇట్టే మనసు వాసన పసిగట్టే గుణం వుంది వాళ్ళలో. ఎక్కడా తేలకూడదు.

మనస్సంతా తీయటి కలవరంతో నిండింది.

రామ్మూర్తి పేపరు మడతపెట్టి లేచి కూర్చున్నాడు.

మనస్సు అంజమ్మవైపు బలంగా గుంజుతోంది.

మామూలుగా వాష్ బేసిన్ దగ్గరే పళ్ళు తోముకునేవాడు. బ్రష్ మీద పేస్ట్ వేసుకుని పక్కసందులోంచి మొక్కలు చూసుకుంటూ పెరటివైపుకు వెళ్ళాడు. అక్కడున్న పూలకుండీలు సర్దుతున్నట్టు

కథా నిలయం 3548 శ్రీకాకుళం

అటూ ఇటూ కదిలిపోతున్న ఓ.. చూపులు అంజమ్మని కొలుస్తున్నాయి. గిన్నెలు తోముతున్న అంజమ్మ గాలికి. పమిటచెంగు పక్కకి తొలగడం గమనించలేదు. రామ్మూర్తి కోరికలు రెక్కల గుర్రాలవుతున్నాయి.

కుండీల దగ్గర అలికిడి విని అంజమ్మ అటు చూసింది. అయ్యగారు కనిపించారు. మెడవంచి తనని చూసుకుని నునుసిగ్గు రంగరించిన చిరునవ్వు పెదాలపైన దోబూచులాడుతుండగా మోచేత్తో పైట కొంగు సరిచేసుకుంటూ 'పనయ్యాక మొక్కలకి నీళ్లు పోస్తానండి అయ్యగారు!' అని చెప్పింది మరో సారి అలవోకగా చూసి రామ్మూర్తి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

రామ్మూర్తికి యింతకుముందెన్నడూ లేని విచిత్ర పరిస్థితి ఏర్పడింది. అదుపు తప్పిన మనస్సు. కళ్లు మూసుకుంటే చేతులు అంజమ్మని గాఢంగా బంధించుకుంటున్న అనుభూతి. కళ్లుతెరిచే ఆ పని చేయాలన్న ఆరాటం క్షణం క్షణం పెరిగిపోతుంది.

వీలు చిక్కినప్పుడల్లా అంజమ్మని కళ్ళల్లో బందీ చేసుకుంటున్నాడు. పది రూపాయలిచ్చి సిగరెట్ పెట్టె తెమ్మన్నాడు. వచ్చే టైం అంచనా వేసి వరండాలో పహారాకాసి పెట్టె అందుకున్నాడు. మిగిలిన డబ్బులివ్వబోతే వుంచుకోమని సైగతో చెప్పాడు. అయినా తిరిగి ఇస్తుంటే సుతారంగా చేయిపట్టుకుని వద్దని వారించాడు, ఆమె కళ్ళల్లోకి తమకంతో చూశాడు, నిమ్మదిగా చేయి విడిపించుకుని అంజమ్మ లోనికెళ్ళింది అమ్మగారి పిలుపువిని, ఆమె మొహంలో కోపం కనిపించలేదు, పెదవులపై చిత్రమైన దరహాసం చెంగలించింది.

ఈ సన్నివేశాన్ని రామ్మూర్తి తన మేధస్సునంతా వాడుకుని వింగడించున్నాడు—'అంజమ్మకి-అంజని అంటే బావుంటుంది—నేనంటే యిదిగా వున్నట్లు తోస్తోంది, లేకపోతే పెదవులమీద చిరునవ్వు ఎందుకు

వుంటుంది? డబ్బులు వద్దని అన్నాక తీసుకుంది, సుజాత తన పనిలో తానుంటుంది, అయినా ఆ మాత్రం జాగ్రత్త పడలేదా? అంజనిని నా పరిష్వంగంలో చేర్చుకోవాలి, తప్పొప్పుల ప్రసక్తి లేదిక్కడ, ఎలా— ఎలా?"

తకరకాల వ్యూహాలు బేరీజు వేస్తున్నాడు, ఆగని ఆవేదన, ఆందోళన, మనస్సుని పీడించే కోరిక,

శనివారం మధ్యాహ్నం ఆఫ్ డే, రామ్మూర్తి ఇంటికొచ్చాడు, అంజమ్మ రెండో పూట పనికి వచ్చే వేళయింది, సుజాత వంటింట్లో టిఫిన్ తయారు చేస్తుంది,

రామ్మూర్తి అవకాశం జారవిడుచుకో కూడదనుకున్నాడు, వరండాలోకి వెళ్ళి అంజమ్మ చేతిలో ఇరవై రూపాయలు పెట్టి రహస్యం చెప్పినట్లు "రేపు రోజూకంటే ముందు చీకటి వుండగానే గేరేజిలోకి రా తీసి వుంచుతాలే, నే నక్కడికి వస్తా, తప్పకుండా రావాలి, నీక్కావలసి నంత డబ్బిస్తా" అని గదిలోకి వెళ్ళిపోయాడు,

అంజమ్మ విస్తుపోయింది.

ఆ సాయంత్రం, రాత్రి రామ్మూర్తికి క్షణం ఒక యుగంలా వుంది, సుజాత కొడుకు రఘు పడుకునే గదిలో నిద్రపోయింది. రామ్మూర్తి కావాలనే ఆమెను లేపలేదు. అక్కడే పడుకోనిచ్చాడు.

ఇంకా చీకటివుండగానే లేచాడు. మెల్లగా పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ వీధి తలుపు తీసి గేరేజ్ వైపు నడిచాడు. తడుముకుంటూ లోపలి కెళ్ళాడు గేరేజి తలుపు పక్కనే మెత్తటి శరీరం చేతికి తగిలింది. కాళ్ళు చేతులూ వణికాయి తెలియని ఆందోళన ఆపాదమస్తకం ఆవరించింది ధైర్యం కూడగట్టుకుని తాను వచ్చిన పనితలుచుకుని ఆమె మెత్తటి శరీరాన్ని రెండుచేతులతో దగ్గరికి తీసుకున్నాడు.

"అంజనీ-అంజనీ" అనీవినీపించీ వినిపించనట్లు పిలుస్తూ మొహం పొదివి పట్టుకున్నాడు. ముక్కుపుడక చేతికి గుచ్చుకున్నప్పుడు తీయని నొప్పి అనుభవించాడు తలకొప్పు సవరించి మెడంతా తడిమాడు చేతులు తారాట్లాడుతున్నాయి.

ఇంతలో పాతపనిమనిషి "అమ్మగారూ ! అమ్మగారూ !" అంటూ అలవాటు ప్రకారం గట్టిగా అరవడం వినిపించింది.

అంతే రామ్మూర్తి హడలిపోయాడు. మెత్తటి శరీరాన్ని గభాల్న వదిలేసి ఆదరా బాదరా వెళ్ళిపోయి వీధి తలుపేసి తన గదిలో పడుకుండిపోయాడు.

రోజు కంటే కొంచెం ఆలస్యంగా లేచి ఏమీ ఎరగనట్లు కాలకృత్యాలు తీర్చుకుని పేపరు చదువుకుంటూ కూర్చున్నాడు కాఫీ కోసం ఎదురుచూస్తూ.

కాఫీ కలుపుతున్న సుజాతకి పాలు నలుపెక్కినట్లు తోచింది తెల్లగా లేవు ఆమె కంటికి.

టీపాయ్ మీద కాఫీ కప్పుపెట్టింది ఆ చప్పుడు విని పేపర్లోంచి తల ఇవతలికి పెట్టి సుజాతవంక చూశాడు ముక్కు పుడక తలకొప్పుతో ఎదురుగా నిల్చున్న సుజాతని చూసి రామ్మూర్తి గతుక్కుమన్నాడు. మొహం వెల తెలపోయింది.

"ముందు కాఫీ తాగండి" అంది సుజాత "అది కాదు సుజాతః" రామ్మూర్తి గొంతు పొడిబారింది. ఏదో చెప్పబోయాడు.

"ఇవుగో అంజమ్మకి మీరిచ్చిన ఇరవై రూపాయలు సిగరెట్టు తేగా మిగిలిన డబ్బులు నాకంతా చెప్పింది పనిమానేసింది. యివ్వాల్టినుంచి గేరేజ్‌లో అంజనిని నేనే" గంభీరంగా చెప్పింది.

"క్షమించు సుజాత" అర్థించాడు.

"నే కాదండి మిమ్మల్ని అంజమ్మే క్షమించింది దాని సంస్కారంలో వందోవంతు సంస్కారం ఇవ్వలేదు మీకు మీ చదువు, హోదా, తెల్లనివన్నీ పాలు కాదని తెలుసుకోండి" విసవిసా లోపలి కెళ్ళిపోయింది

సుజాత కిప్పుడు వెనకటి సూక్తి గుర్తు రావడం లేదు. "శీలం హి సర్వస్య నరస్య భూషణమ్" అనే సూక్తే ఎప్పుడూ మనస్సులో మెదులుతుంటుంది

# దేశం పిలిచింది

కొడుకు సాంబయ్య వస్తున్న సంగతి తెలియగానే వెంకటేశు సంతోషంతో వుబ్బి తబ్బిబ్బులయ్యాడు. ఉత్తరం పట్టుకుని వాడ పెద్ద ఫకీరయ్య దగ్గరికి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ బయలు దేరాడు. దార్లో కనిపించిన వాళ్ళందరికీ చెప్పుకుంటూ ఫకీరయ్య పాక చేరుకున్నాడు. సాంబయ్య రాక గురించి విన్న ఫకీరయ్య ఆనందంతో "మన సాంబన్న వస్తున్నాడా?" అన్నాడు, గొంతు గద్గదిక మయింది.

సాంబయ్య పేరు చెబితే వాడంతా వుప్పొంగుతుంది. సాంబయ్య ఆ వాడలో ప్రతి యిల్లూ తనదిగా ఎంచుకుంటాడు. అభిమానం పంచుకుంటాడు

ఫకీరయ్య ఒక్క నిమిషం ఆలోచించి "వెంకటేశం! జాగ్రత్తగా విను రోడ్డు కాడికి అందరం ఎప్పటిలాగే వెళ్ళాలి. అన్ని